క్లుప్తంగా

దేవీ నవరాత్రి ఉత్సవాలకు పందిరి రాట



సీతంపేట హరిజన వీధిలో రాట వేస్తున్న మువ్వల పోలారావు, కమిటీ సభ్యులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు సీతంపేట హరిజన వీధిలో గాంధీ హరిజన సేవా సంఘం ఆధ్వర్యంలో ఆదివారం దుర్గాదేవి నవరాత్రి మహోత్సవాలకు ముహూర్తపు రాట కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి మాజీ కార్పొరేటర్ మువ్వల పోలారావు కమిటీ సభ్యులతో కలిసి రాట వేశారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 5 వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు పిల్లి పవన్, సిహెచ్.మోహన్, ఓదురు బబ్లు, శ్రావణ్ కుమార్, ఎస్సీ నాయకుడు జోరీగల గణేష్, వార్డు నాయకులు భోగవిల్లి గోవింద్, జోరీగల కనకరాజు, గుమ్మడి గోపి, స్థానిక మహిళలు పాల్గొన్నారు.

సినీ, టీవీ ఏజెంట్ల నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులతో సినీ ఏజెంట్లు

సీతంపేట: తెలుగు సినీ, టీవీ డిజిటల్ జూనియర్ ఆర్టిస్ట్స్ ఏజెంట్స్ యూనియన్ ఆంధ్ర రాష్ట్ర నూతన కార్యవర్గ ఎన్నికలు ఆదివారం 26వ వార్డు ఎన్జీజీవోస్ కాలనీలో జరిగాయి. యూనియన్ అధ్యక్షుడిగా నీలాపు వీరాంజనేయరెడ్డి, కార్యదర్శిగా వియ్యపు ఎర్రాజి, కోశాధికారిగా కుక్కల రవికిరణ్ ఎన్నికయ్యారు. రాష్ట్రం నలుమూలల రాజమహేంద్రవరం, తిరుపతి, రామచంద్రాపురం, కాకినాడ జిల్లాల నుంచి ఏజెంట్లు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నూతన కార్యవర్గాన్ని ఏజెంట్స్ యూనియన్ హెడ్ ఆఫీస్ (హైదరాబాదు) అధ్యక్షుడు ఆర్.ఆర్.నాయుడు ప్రకటించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవిశంకర్, కోశాధికారి రాజ్‌కుమార్, తెలుగు సినీ, టీవీ డిజిటల్ జూనియర్ ఆర్టిస్ట్స్ యూనియన్ అధ్యక్షుడు డి.స్వామిగౌడ్, సినీ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ బండారు ఈశ్వర ప్రసాద్ పాల్గొన్నారు.

మంచిగా మెలగాలి



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న స్టేషన్ రైటర్ లక్ష్మణ్

తాటిచెట్లపాలెం: రౌడీషీటర్లు తమ తీరు మార్చుకుని, సత్ప్రవర్తనతో మెలగాలని ఫోర్త్ టౌన్ లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ రైటర్ పి.లక్ష్మణ్ సూచించారు. స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు ఎటువంటి గొడవల్లో తలదూర్చకూడదని, మంచి ప్రవర్తన కలిగి ఉండాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లుగా నమోదైన ప్రతి ఒక్కరూ సంబంధిత స్టేషన్‌లో విధిగా సంతకాలు చేయాలని, వీరి కదలికలపై ఏమైనా అనుమానం వస్తే వెంటనే అదుపులోకి తీసకుని బైండోవర్ చేస్తామని లక్ష్మణ్ తెలిపారు.

17న మెగా రక్తదాన శిబిరం



వివరాలు వెల్లడిస్తున్న పరిషత్ సభ్యులు

దాబాగార్డెన్స్: ఈ నెల 17న విశాఖలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు తెరపాంత్ యువక్ పరిషత్ విశాఖ శాఖ సభ్యులు తెలిపారు. డాబాగార్డెన్స్ ఆదాయపు పన్ను శాఖ కార్యాలయ రోడ్డులోని పరిషత్ కార్యాలయంలో ఆదివారం కమిటీ సభ్యులు వివరాలు వెల్లడించారు. దేశవ్యాప్తంగా ఈ మహా రక్తదానం జరుగుతుందన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా మెగా రక్తదాన శిబిరం నిర్వహించి గిన్నిస్ వరల్డ్ రికార్డ్ కూడా సొంతం చేసుకున్నట్టు చెప్పారు. విశాఖలో ఆపదలో ఉన్న ప్రజల ప్రాణాలు కాపాడేందుకు ఈ శిబిరం ద్వారా రక్తం సేకరించి అందిస్తామని తెలిపారు. ఈ మహా రక్తదానంలో సుమారు 2500 యూనిట్ల రక్త సేకరణే లక్ష్యమని పేర్కొన్నారు. ఒక్క విశాఖలోనే 60 కేంద్రాల్లో రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రజలు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయాలని పరిషత్ సభ్యులు కోరారు.



బిర్లా కూడలి సమీపంలో సర్వీస్ రోడ్డుపై ఏర్పడిన భారీ గొయ్యి

వాన నీరు పోయే మార్గమేది?

- వర్షపు నీరు నిలిచిపోయి కోతకు గురవుతున్న జాతీయ రహదారి
- హైవేలో మూసుకుపోయిన నీరు పోయే మార్గాలు
- గుంతలు ఏర్పడి శిథిలమవుతున్న సర్వీస్ రోడ్లు
- అక్కరకు రాని డ్రైనేజీ వ్యవస్థ
- సమస్యను పట్టించుకోని అధికారులు



జీవీఎస్ సమీపంలో డ్రెయిన్ మూసుకుపోవడంతో రహదారిపై నిలిచిన వర్షపు నీరు, బురద

మురళీనగర్: భారీ వర్షాలకు రహదారులు ఛిద్రమవుతున్నాయి. ముఖ్యంగా మురళీనగర్ – ఎన్ఏడీ జాతీయ రహదారి నీటి కోతకు గురవుతోంది. ఈ మార్గంలో వర్షపు నీరు చేరి నిల్వ ఉండటం వల్ల రోడ్డు శిథిలమవుతోంది. వర్షాలు కురుస్తున్న ప్రతి సారి వరద నీరు నిలిచిపోయి నీటి మడుగుల్లా తయారవుతున్నాయి. వాన నీటిలో వాహనాల రాకపోకల సమయంలో రాపిడికి తారు రోడ్డు పైపొర ఊడి గుంతలుగా ఏర్పడుతున్నాయి. ఇవి రానురాను పెద్దవై ప్రమాదకరంగా మారుతున్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. డ్రైనేజీ వ్యవస్థ లోపం వల్ల ఈ పరిస్థితి ఏర్పడింది.

హైవేలో నీటి గుంతలు

ఎన్ఏడీ జంక్షన్ నుంచి మురళీనగర్ మీదుగా ఊర్వశి కూడలి వరకు సాగే జాతీయ రహదారి నీటి గుంతలుగా మారుతోంది. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వర్షాలు కురిసినప్పుడు అనేక చోట్ల నీరు నిలిచిపోతోంది. దీని వల్ల ప్రయాణాలకు ఆటంకం కలిగించడమే కాకుండా వాహన చోదకులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది. మర్రిపాలెం కూడలి నుంచి ఆర్అండ్‌బీ, జీఎస్ఐ, ఆర్టీవో కార్యాలయం కూడలి, గంగా భవాని అపార్ట్‌మెంట్ల ప్రాంతం, బిర్లా కూడలి, వర్మా కాంప్లెక్స్ అనుబంధ రహదారి ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. ఈ సమస్యపై గతంలో అనేక సార్లు 'సాక్షి'లో కథనాలు ప్రచురించినా.. తాత్కాలిక చర్యలు మినహా.. ప్రత్యేక చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



ఆర్టీవో కార్యాలయం అనుబంధ రహదారి డివైడర్ వద్ద వాన నీరు

నీరు పోయే దారేది..?

వర్షాలు కురుస్తున్న సమయంలో జాతీయ రహదారికి అనుబంధంగా నిర్మించిన డ్రెయిన్‌లోకి ఆ నీరు పోవాలి. ఈ ప్రాంతంలో ఆ పరిస్థితి లేదు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకునే తీరిక లేదు. నీటి కోతకు రహదారులు పాడవుతున్నా సమస్య పరిష్కారానికి తీసుకున్న చర్యలు శూన్యం. జాతీయ రహదారికి అనుబంధంగా నిర్మించిన డివైడర్ల వద్ద నీటి ప్రవేశ మార్గాలు మూసుకుపోగా, సర్వీసు రోడ్డుకు అనుబంధంగా నిర్మించిన డ్రెయిన్‌లు ఎత్తుగా ఉండటంతో రహదారిపై నీరు ఎక్కువ రోజులు నిలిచిపోతోంది. హైవేలో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకీకరించాల్సిన అవసరముంది. అధికారులు దృష్టి సారించి జాతీయ రహదారితోపాటు సర్వీస్ రోడ్డును కాపాడేందుకు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

ప్రమాదాలకు నిలయంగా సర్వీస్ రోడ్డు

బిర్లా కూడలి నుంచి సత్యానగర్ వరకు సర్వీస్ రోడ్డులో అనేక చోట్ల శిథిలమై గుంతలు ఏర్పడ్డాయి. ఎక్కువ సమయం నీటిలో వాహనాలు వేగంగా ప్రయాణిస్తున్నప్పుడు తారురోడ్డు పైపొరలు ఊడిపోయి.. బ్లాక్ మెటల్ తేలిపోయి గుంతలుగా మారిపోతున్నాయి. నిత్యం బిజీగా ఉండే బిర్లా కూడలి వద్ద పొడవాటి భారీ గొయ్యి ఏర్పడింది. వర్షపు నీటితో పాటు ఈ ప్రాంతంలో కార్ వాష్, ఇతర వాహనాల వాషింగ్ కేంద్రాలు ఉండటంతో వాటి నుంచి వచ్చే నీరంతా రోడ్డుపైకి చేరుతోంది. ఈ గోతుల్లో పడి వాహన చోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. ఫుట్‌పాత్‌లన్నీ వ్యాపార కేంద్రాలకు అడ్డాగా మారాయి. వాహనాల మరమ్మతు కేంద్రాలు రహదారులను ఆనుకుని ఉండటంతో ఆయిల్ వర్షపు నీటితో కలిసి రోడ్డు మీదకు చేరి ప్రమాదాలకు కారణమవుతోంది. ఈ సమస్యను పట్టించుకునే నాథుడే లేదు.



డ్రైనేజీ లేక రోడ్డుపై నిలిచిపోయిన వర్షపు నీరు



బిర్లా జంక్షన్ రోడ్డులో నీటి కోతకు ఏర్పడిన భారీ గొయ్యి



జాతీయ రహదారి గ్రీన్‌బెల్ట్ సమీపంలో నిలిచిపోయిన వర్షపు నీరు

ఐక్య ఉద్యమంతోనే హక్కుల సాధన



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కె.ఎస్.చలం

సీతంపేట: దళిత బహుజనులు ఏకం కావాలని, హక్కుల కోసం ఐక్య ఉద్యమమే మార్గమని ద్రావిడ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ప్రొఫెసర్ కె.ఎస్.చలం అన్నారు. భీమ్ సేన వార్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన సదస్సులో బహుజనులారా మీరు ఎటువైపు అనే అంశంపై ఆయన ప్రసంగించారు. బహుజనులంతా అనేక పార్టీల కింద విభజించి ఉన్నారని, వారంతా ఏకమై హక్కుల సాధన, రాజ్యాధికారం దిశగా పయనించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, పెరియార్ రామస్వామి కలిసి దేశమంతా తిరిగి ఉద్యమాన్ని నిర్మించారన్నారు. రిజర్వేషన్లు తొలిసారి తమిళనాడులో అమల్లోకి వచ్చాయని, వాటికి ఆటంకం ఏర్పడితే 1951లో రాజ్యాంగ సవరణ జరిగిందన్నారు. సిక్కోలు బుక్ ట్రస్టు సంపాదకుడు దుప్పల రవికుమార్ అస్తిత్వ స్పృహ అనే అంశంపై మాట్లాడుతూ భారతదేశం 6300 కులాలుగా, ఎస్సీ, ఎస్టీ, బీసీలను చీల్చి వేసి వారి మధ్య ఐక్యత లేకుండా విష సంస్కృతిని సృష్టించారన్నారు. అనంతరం సదస్సులో పలు తీర్మానాలు ఆమోదించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వసంత రాజేంద్రప్రసాద్, కె.చిన్నారావు, కనకరాజు, మధు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



నిత్యావసర సరకులు అందిస్తున్న మానవ సేవే మాధవ సేవ సంఘం ప్రతినిధులు

మురళీనగర్: మానవ సేవే మాధవ సేవ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సేవా కార్యక్రమంలో భాగంగా ఆర్థిక ఇబ్బందులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి నిత్యావసర సరకులు అందించారు. 16 మందికి బియ్యం, ఇతర సరకులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు ఎస్.భానుప్రకాష్, గౌరవ అధ్యక్షుడు డి.ప్రసాద్ రాజు, అధ్యక్షుడు ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు కేవీఎస్ ప్రసాద్, డి.వరప్రసాద్, పి.గిరిధర్, కార్యదర్శి వై.త్రిమూర్తులు, ఇతర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులదే ముఖ్య పాత్ర

సీతంపేట: విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులది అత్యంత ముఖ్యమైన పాత్రని నాగార్జున యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య వి.బాలమోహన్ దాస్ అన్నారు. బాలవికాస్ ఫౌండేషన్, గాంధీ సెంటర్ ఆధ్వర్యంలో బుల్లయ్య కళాశాలలోని గాంధీ సెంటర్‌లో ఆదివారం జాతీయ, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషి ద్వారానే విద్యార్థి జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోగలరన్నారు. విద్యార్థుల మేధస్సుకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయుల బోధన సాగాలన్నారు. కృష్ణ యూనివర్సిటీ రిటైర్డ్ వీసీ ఆచార్య రామకృష్ణారావు మాట్లాడుతూ విద్యార్థులు ప్రాథమిక విద్య నుంచే క్రమశిక్షణ, అంకితభావం అలవాటు చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంతోపాటు సమాజ అభివృద్ధికి పాటుపడాలన్నారు. అనంతరం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన తిరుమల శ్రీదేవి, రాష్ట్ర స్థాయిలో అవార్డులు పొందిన జి.కుమారస్వామి, జి.ఎం.సుజాత, ఎం.మోహనరావులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రిటైర్డ్ డీజీపీ అత్తిలి సుధాకర్, బాల వికాస్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నరవ ప్రకాశరావు, రచయిత ఆర్.శివకుమార్, బ్రహ్మకుమారీస్ ప్రతినిధి బి.కె.కామేశ్వరి, బీవీఎఫ్ కన్వీనర్ జ్ఞానేశ్వర్ బాబ్జి, అధ్యాపకులు, ఎన్జీవోలు పాల్గొన్నారు.



ఉత్తమ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఆచార్య బాలమోహన్‌దాస్

మిద్దెతోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదాం



ద్వారకానగర్‌లో క్లాత్ బ్యాగులు ప్రదర్శిస్తున్న వనమాలి గ్రూప్ సభ్యులు



మురళీనగర్‌లో గుడ్డ సంచులు వాడాలంటూ ప్రదర్శిస్తున్న మహిళలు

సీతంపేట: మిద్దెతోటల నగరంగా విశాఖను తీర్చిదిద్దుదామని, క్లాత్ బ్యాగులు వాడుదామని ద్వారకానగర్ వనమాలి, సీటీజీ మిద్దెతోటల మహిళలు నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం ద్వారకానగర్‌లోని సుగుణ వల్లి మిద్దెతోటలో వారంతా సమావేశమయ్యారు. గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో అందజేసిన దేశీయ నల్లని, తెల్లని వంగ, గుంటూరు పచ్చిమిర్చి, టమాట, బంతి నారు మొక్కలు పంపిణీ చేశారు. స్వచ్ఛ భారత్, స్వచ్ఛ ఆంధ్ర – స్వర్ణ ఆంధ్రలో భాగంగా ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కోరమాండల్ ఫర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీమ్ అందజేసిన గుడ్డ సంచులను వనమాలి గ్రూప్ సభ్యులకు అందించారు. గ్రూప్ ఇన్‌చార్జిలు లావణ్య, మహాలక్ష్మి నాయకత్వం వహించారు. కార్యక్రమంలో సుధారామ, సుగుణ వల్లి, జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి ఆధారిత పంటలే మేలు

మురళీనగర్: ప్రకృతి ఆధారిత పంటలే ఆరోగ్యకరమని వనమాలి, సీటీజీ గ్రూప్‌ల అడ్మిన్ అరవల అరుణ అన్నారు. మురళీనగర్‌లోని రాజు మిద్దెతోటలో ఆదివారం మిద్దెతోటల పెంపకందారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంట్లో తయారు చేసిన దేశీయ విత్తనాలతో ఆకుకూరలు, కూరగాయలు పండించుకోవాలని సూచించారు. ఇచ్చిపుచ్చుకునే విధానంలో విత్తనాలు, మొక్కలు పంపిణీ చేసుకోవాలన్నారు. గ్రీన్ క్లైమేట్ టీం సహకారంతో దేశీయంగా తయారు చేసిన నల్లని, తెల్లని వంగ, గుంటూరు పచ్చిమిర్చి, టమాటా, బంతి నారు మొక్కలు పంపిణీ చేశారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, కోరమండల్ ఫెర్టిలైజర్స్, గ్రీన్ క్లైమేట్ టీం సంయుక్తంగా అందించిన గుడ్డ సంచులు అందజేశారు. కార్యక్రమంలో గ్రూప్ ఇన్‌చార్జిలు రమాదేవి, దేవిక తదితరులు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధిపై అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటు

అల్లిపురం: సారథ్యం పేరుతో విశాఖలో నిర్వహించిన బహిరంగ సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఉత్తరాంధ్ర ప్రజలకు బీజేపీ చేసిన ద్రోహాన్ని కప్పిపెట్టి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. మోదీ ప్రభుత్వం దేశంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్టీల్‌ప్లాంట్లకు గనులు కేటాయించి, విశాఖ ఉక్కు పరిశ్రమకు మాత్రమే సొంత గనులు కేటాయించకుండా నష్టాల పాలు చేసిందన్నారు. స్ట్రాటజిక్ సేల్ పేరుతో 100 శాతం అమ్మకానికి పెట్టి, 2000 మంది పర్మినెంట్ కార్మికులను, 5 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులను తొలగించి, ప్లాంట్‌లోని 6 వేల ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. ప్లాంట్ రక్షణ కవచాలైన ఫైర్ అండ్ సేఫ్టీ, సీఐఎస్ఎఫ్ విభాగాలను సైతం ప్రైవేటీకరించడం విశాఖ ఉక్కును ఆదుకోవడమా.. ధ్వంసం చేయడమా అని ప్రశ్నించారు. ఇలా అనేక అంశాల్లో మోదీ ప్రభుత్వం ఉత్తరాంధ్రకు తీవ్ర ద్రోహం చేస్తోందన్నారు. ఈ ద్రోహాన్ని కప్పిపుచ్చి పీవీఎన్ మాధవ్ అభివృద్ధి ప్రగల్భాలు పలకడం సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా వీరు ప్రజాద్రోహాన్ని ఆపి, విశాఖ స్టీల్ ప్లాంట్, ఉత్తరాంధ్ర అభివద్ధికి కృషి చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

చెట్ల కొమ్మల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



మురళీనగర్ సెక్టార్-7లో చెట్ల కొమ్మలు తొలగించిన ప్రాంతం

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్-7లో నరికి వదిలేసిన చెట్ల కొమ్మలను ఎట్టకేలకు తొలగించారు. విద్యుత్ శాఖ నిర్వహించే చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా నరికి చెట్లను బృందావన్ అపార్ట్‌మెంట్, ఎస్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో వదిలేయడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులపై 'నరికేశారు.. వదిలేశారు' అనే శీర్షికన ఇటీవల 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ ప్రాంతాల్లోని కొమ్మలను అక్కడి నుంచి తొలగించడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కళాకారులతో సాంస్కృతిక వైభవం



విజేతలకు జ్ఞాపికలు అందజేస్తున్న అతిథులు

దాబాగార్డెన్స్: అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మిరాకిల్ డ్యాన్స్ అకాడమీ వ్యవస్థాపకుడు మహ్మద్ షకీల్ ఆధ్వర్యంలో 'టాలెంట్ హంట్' పేరిట ఆదివారం నృత్య పోటీలు నిర్వహించారు. ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. కళాకారులతో సాంస్కృతిక వైభవం కలుగుతుందన్నారు. నృత్య కళాకారులు నాట్యగురువులు చెప్పే ప్రతి అంశంపై చక్కటి అవగాహన పెంపొందించుకుని చక్కని నృత్య కళాకారులుగా ఎదిగి రాణించాలన్నారు. ఈ సందర్భంగా నృత్య కళల అభివృద్ధికి కృషి చేస్తున్న జి.రాజేశ్వరి, ఎం.రాజేశ్వరి, భవ్య రాశి, కల్యాణ్, నాట్య గురువులను ఘనంగా సత్కరించారు. పాల్గొన్న వారందరికీ ప్రశంసాపత్రాలు, విజేతలకు జ్ఞాపికలను గాయకులు మహ్మద్ తాజ్, మహ్మద్ షకీల్ అందజేశారు. కార్యక్రమంలో నృత్య గురువులు, కళాకారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్టోబర్ 2న సంగీత విభావరి

జగదాంబ: లతా మంగేష్కర్ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 2న సంగీత విభావరి నిర్వహించనున్నట్టు యాక్మి సాంస్కృతిక సంస్థ నిర్వాహకుడు యాక్మి ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. డాబాగార్డెన్స్ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 2వ తేదీ సాయంత్రం 6 గంటలకు హిందీ గాయని గుల్ సక్సేనాచే లైవ్ ఇన్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నామన్నారు. శామ్యూల్ జాన్ సంగీత సారథ్యంలో జరిగనున్న ఈ కార్యక్రమ పోస్టర్‌ను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఆవిష్కరించినట్లు చెప్పారు. లతా మంగేష్కర్ అభిమానులు, నగర ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉత్సాహంగా బీచ్ క్లీనింగ్



తెన్నేటి పార్కు వద్ద బీచ్‌ను శుభ్రం చేసిన పారిశుధ్య కార్మికులు, ట్రిపుల్ ఒన్ యువత

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు తెన్నేటి పార్కు, జోడుగుళ్ల పాలెం ప్రాంతాల్లో శానిటరీ సిబ్బంది బీచ్‌ను శుభ్రం చేశారు. ట్రిపుల్ ఒన్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ యువత ఉత్సాహంగా పాల్గొని బీచ్‌లోని చెత్త సేకరించి శుభ్రం చేశారు. ఖాళీ కొబ్బరి బొండాలు, ప్లాస్టిక్ సంచులు, పేపర్ ప్లేట్లు, ఇతర చెత్తను సేకరించిన సంచుల్లో వేసి జీవీఎంసీ పారిశుధ్య వాహనాలకు అందించి డంపింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ, సిబ్బంది, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.